సాక్షి
పెద్దపల్లి
గురువారం । 7 । డిసెంబర్ । 2023



ఘనంగా ఆరట్టు

వేములవాడఅర్బన్: తిప్పాపూర్‌లోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ఆరట్టు మహోత్సవం నిర్వహించారు.



నృసింహునికి మొక్కులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయానికి రూ.1.20 లక్షల ఆదాయం సమకూరింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాఠశాలల సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న సీపీడీ బృందం

మంథని: కరీంనగర్‌లోని డైట్ సీపీడీ అధికారుల బృందం జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను బుధవారం సందర్శించింది. సర్కారు బడుల ఉపాధ్యాయులు వృత్తిపరమైన అభ్యున్నతి సాధించడం, తద్వారా చదువుల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ప్రగతి పరిశీలించడం లక్ష్యంగా అధికారులు ఈ పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల, బాలుర, ఉన్నత పాఠశాలు, ముత్తారం మోడల్ స్కూల్, లక్కారం ఉన్నత పాఠశాలలను వారు సందర్శించారు. ఉన్నతి కార్యక్రమ బేస్‌లైన్ పరీక్ష పత్రాలు పరిశీలించారు. సమ్మేటివ్ అసెస్మెంట్ పేపర్ వాల్యూయేషన్, ఉపాధ్యాయుల టీచింగ్ డైరీ రాసే విధానంపైనా వారు వివరించారు. పదో తరగతి విద్యార్థులకు లక్ష్య ప్రోగ్రామ్‌పై వారు అవగాహన కల్పించారు. విషయ నిష్ణాతులు బి.ఓదెలు కుమార్, ఎండీ షరీఫ్ అహమద్, వినయధర్ రాజు, రమేశ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



ప్రతిభ చూపిన విద్యార్థులు

రామగుండం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి పోటీలు మంగళవారం జగిత్యాలలో నిర్వహించారు. అంతర్గాం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సీహెచ్ శ్రావణ్ (8వ తరగతి), జి.స్పందన, వై.రాహుల్, ఎం.శిరీష(పదో తరగతి) ఇందులో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ సోమశేఖర్ తెలిపారు. వీరిని హెచ్‌ఎం ఏకాంబరం, ఎస్‌ఎంసీ చైర్మన్ రాములు, వైస్ చైర్‌పర్సన్ ఉమాదేవి అభినందించారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి



కేటీఆర్‌తో చందర్


గోదావరిఖని: రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బుధవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలుసుకున్నారు. ఈసందర్భంగా చందర్‌ను కేటీఆర్ దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకుని నేనున్నానని ధైర్యం చెప్పారు. దీంతో నియోజకవర్గ ప్రజలకు, జిల్లా నాయకులను కాపాడుకోగలుగుతాననే విశ్వాసం వచ్చిందని చందర్ తెలిపారు.

9 నుంచి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

ధర్మారం(ధర్మపురి): నందిమేడారం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్రస్థాయి గురుకుల బాలికల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శైలజ బుధవారం తెలిపారు. అండర్‌- 14, 17, 19 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాల్‌బాడ్మింటన్, టెన్నికాయిట్, చెస్ పోటీలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల గురుకులాల బాలికలు పోటీలకు హాజరవుతారని తెలిపారు. ఆసక్తి గల గురుకుల విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని ఆమె కోరారు.

ఇక ‘పల్లె పోరు’

ఫిబ్రవరి ఒకటితో ముగియనున్న పంచాయతీల గడువు



- సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్లకు ఎస్‌ఈసీ ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో పంచాయతీరాజ్ ఆకస్మిక సమావేశాలు
- పెరిగిన ఓట్లతో స్వల్పంగా పెరగనున్న పోలింగ్ కేంద్రాల సంఖ్య

పెరిగిన ఓటర్ల సంఖ్య ఇలా..

నియోజకవర్గం	కొత్త ఓటర్లు
కోరుట్ల	20,652
జగిత్యాల	24,021
ధర్మపురి	17,890
రామగుండం	25,882
మంథని	23,591
పెద్దపల్లి	27,413
కరీంనగర్	54,831
చొప్పదండి	16,957
వేములవాడ	25,451
సిరిసిల్ల	22,408
మానకొండూర్	15,909
హుజూరాబాద్	35,181
హుస్నాబాద్	14,005

ఉమ్మడి జిల్లా పంచాయతీల సమాచారం

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు
పెద్దపల్లి	14	263	2436
జగిత్యాల	20	380	3500
సిరిసిల్ల	13	255	2444
కరీంనగర్	16	313	2966

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ పోరు ముగిసిన నేపథ్యంలో మరో ఎన్నికల పోరుకు తెరలేవనుంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు రాష్ట్రఎన్నికల సంఘం(ఎస్‌ఈసీ) సిద్ధం అవుతోంది. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా కలెక్టర్లకు ఎస్‌ఈసీ ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్లకు సంబంధించిన వివరాల కోసం జిల్లాల వారీగా నివేదికలు పంపాలని ఆదేశాలు జారీచేసింది.

పెరిగిన ఓట్లు.. బూత్‌లు పెరిగేనా!

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2018 ఎన్నికల నాటికి 13 నియోజకవర్గాల్లో 27,88,092 మంది ఓటర్లు ఉండగా.. తాజాగా జరిగిన ఎన్నికల్లో 31,12,283 మందికి చేరుకున్నారు. కొత్తగా 3,24,191 మంది ఓటర్లు వచ్చారు.

మరిన్ని పెరిగే అవకాశం..

గ్రామ పంచాయతీ ఎన్నికల తేదీ నాటికి కొత్త ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు 200 మంది ఓటర్ల వరకు ప్రతీ పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక పోలింగ్ ఆఫీసర్ ఉండాలి, 201 నుంచి 400 ఓట్ల వరకు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు పోలింగ్ ఆఫీసర్లు, 401 నుంచి 650 ఓటర్ల వరకు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ముగ్గురు పోలింగ్ ఆఫీసర్లు ఉండాలి. ఈ మేరకు సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపింది. 650 ఓట్లు దాటితే అధికారులు అదనంగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేయనున్నారు.

మూడు దశల్లో ఎన్నికలు..!

జనాభా దామాషా పద్ధతిన రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. గ్రామాల్లోని జనాభాను బట్టి బడుగు, బలహీనులు పోటీ చేసే అవకాశాలు ఉంటాయి. అయితే, ఈసారి.. ఐదేళ్ల కింద జరిగిన పద్ధతిలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈసారి కూడా గతంలో లాగానే మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలిదశలో వినియోగించుకున్న సిబ్బందిని మూడో దశలోనూ వినియోగించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,211 గ్రామాలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే, కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఇంకా గ్రామస్థాయిలో రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేయాల్సి ఉంది. ఆ తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుంది. అయితే, గడువులోగానే ఎన్నికలు నిర్వహిస్తుందా? లేక మరికొంత సమయం తీసుకుంటుందా? అనేది వేచిచూడాలి.

ఫిబ్రవరి ఒకటితో ముగియనున్న పదవీకాలం

వచ్చే ఏడాది(2024) ఫిబ్రవరి ఒకటో తేదీన సర్పంచుల పదవీకాలం ముగియనుంది. ఆర్టికల్ 2(4)(3) ప్రకారం గ్రామపంచాయతీల పదవీకాలం ఐదేళ్లు. పంచాయతీరాజ్ యాక్ట్ 14(2) ప్రకారం గ్రామ పంచాయతీల పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందుగానే ఎన్నికలు నిర్వహించాలి. ఈమేరకు ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తుగా సమాచారం ఇస్తుంది. అలాగే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేస్తుంది. ఆ మేరకు రిజర్వేషన్లకు సంబంధించి గ్రామ కార్యదర్శులు ఎన్నికల అధికారులకు నివేదికలు పంపాల్సి ఉంటుంది. వాటిని క్రోడీకరించిన తర్వాత రిజర్వేషన్లతోసహా ఎన్నికల తేదీలు ప్రకటిస్తారు. అందులో భాగంగానే తాజాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల కలెక్టర్లకు ఆదేశాలు వచ్చాయి. ఎన్నికల సిబ్బంది, సాంకేతిక అంశాల పరంగా సంసిద్ధంగా ఉండాలని ఆదేశాల్లో ఎస్‌ఈసీ స్పష్టంచేసింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆకస్మిక సమావేశం నిర్వహించిన జిల్లా అధికారులు.. ఎస్‌ఈసీ సూచనలు, ఎన్నికల ప్రక్రియ, అనుసరించాల్సిన వ్యూహం, మానవ వనరులు, సాంకేతిక అంశాలపై చర్చించారు.

పత్తికి మద్దతు కరువు



ఈమె పేరు పిడుగు లక్ష్మి. పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ స్వగ్రామం. తనకున్న చేనులో ఈసారి పత్తి పండించింది. పెద్దపల్లి మార్కెట్‌కు తేగా క్వింటాలు పత్తికి రూ.6,211 కన్నా ఎక్కువ ధర రాలేదని వాపోయింది.



ఇతడి పేరు కాసు మహేశ్. మంథని మండలం గద్దలపల్లి స్వగ్రామం. తనకున్న వ్యవసాయ భూమిలో గతేడాది పత్తి పండించాడు. మంచిధర వస్తుందనే ఆశతో తన ఇంట్లో పత్తి నిల్వ చేశాడు. ఏడాది గడిచినా గిట్టుబాటు కావడంలేదు. మళ్లీ కొత్త సీజన్ దిగుబడి వస్తోంది. ఏం చేయాలో పాలుపోవడం లేదని పేర్కొంటున్నాడు.

- పత్తాలేని సీసీఐ కొనుగోళ్లు
- గిట్టుబాటులేక రైతుల ఆవేదన
- ఇళ్లలోనే ఇంకా పాత నిల్వలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పత్తిరైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. సిరులు కురిపిస్తుందని సాగు చేసిన తెల్లబంగారానికి మద్దతు రావడం లేదు. నవంబర్ ఒకటి నుంచి మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు చేస్తున్నా.. రోజూ 500 – 600 క్వింటాళ్లకు మించి సేకరించడం లేదు. దీంతో ప్రైవేట్ వ్యాపారులకు అగ్గువసగ్గువకే అమ్ముకుంటున్నారు.

సీసీఐ జాడేది?

- కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలు కనీస మద్దతు ధర రూ.7,020 చెల్లించి కొనుగోలు చేయాల్సిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జాడే కనిపించడం లేదు.
- పెద్దపల్లి ప్రాంతంలోని రెండు మిల్లుల్లో సీసీఐ అధికారులు నవంబర్ నుంచి నామమాత్రంగా పత్తి కొనుగోలు చేస్తున్నారు.
- ఈ సీజన్‌లో జిన్నింగ్ మిల్లుల ఆవరణలో 1,058 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు తెలిసింది.



పెద్దపల్లిలో నామమాత్రంగా కొనుగోళ్లు

- నిబంధనలకు అనుగుణంగా పత్తి తేవడం లేదని, అందుకే కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని సమాచారం.

ఇళ్లలో ఇంకా పాత పత్తి నిల్వలు..

మంచిధర వస్తుందనే ఆశతో జిల్లాలోని పలువురు రైతులు గత సీజన్‌లో పండించిన పత్తిని ఇంకా తమ ఇళ్లలోనే నిల్వచేసుకున్నారు. ప్రస్తుతం కనీస మద్దతు ధర కూడా లభించకపోవడంతో నిల్వలు అలాగే ఉండిపోతున్నాయి. సీసీఐ కొనుగోలు కేంద్రాలను మిల్లులకే పరిమితం చేయకుండా మార్కెట్‌యార్డులోనూ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు.. పాత పత్తి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కాటన్, జిన్నింగ్ మిల్లు అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం జిల్లా మార్కెటింగ్ అధికారికి విన్నవించారు.

గిట్టుబాటు ధర రాలే..



నాకున్న రెండెకరాల్లో పత్తి ఏసిన. కొంత అమ్ముకుందామని తెస్తే మంచిధర రాలే. నాణ్యత బట్టి ధర ఉంటుందని చెప్పిండ్రు. అవసరాలకోసం ఎంత కొంతకు అమ్ముకుని పోతున్న.

–శంకరయ్య, చిన్నకల్వల

పాత పత్తి కొనాలి



పాతపత్తి కొనుగోలుకు సీసీఐ కొంటర్లు ఏర్పాటు చేయాలి. గత సీజన్‌లో క్వింటాలుకు రూ.10వేల వరకు ధర పలికింది. ఇంకా పెరుగుతుందని రైతులు ఇళ్లలో నిల్వ చేసుకున్నారు.

– సాంబిరెడ్డి, కాటన్ అసోసియేషన్ నేత

నిబంధనలు సవరించాలి



పత్తి రైతులకు మేలు చేసేలా సీసీఐ అధికారులు నిబంధనలు సవరించాలి. రైతులు బస్తాల్లోనే పత్తి తెస్తారు. అందుకు అనుమతి ఇవ్వాలి. అధికారులు సహకారం అందిస్తే మేలు కలుగుతుంది.

–ఎడ్ల మహేందర్, అడ్తివ్యాపారి

నిబంధనల మేరకే కొనుగోళ్లు



ఈ–నామ్ పద్ధతిన పత్తి సేకరిస్తున్నాం. సీసీఐ జిన్నింగ్‌మిల్లుల వద్ద కొనుగోలు చేస్తోంది. నిబంధనల ప్రకారం నాణ్యతను బట్టి ధర నిర్ణయిస్తారు. ఇందులో ఎలాంటి పొరపాట్లుండవు.

–ప్రవీణ్‌కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి

‘గుర్తింపు’తో సమ్మెలకు చెక్

- సింగరేణి యాజమాన్యం కీలక నిర్ణయం
- ఆ క్రమంలోనే సంస్థలో ఎన్నికల నిర్వహణ
- బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా వ్యూహం



గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల్లో 1998కు ముందు అనేక సమ్మెలు జరిగాయి. గనులు, డివిజన్లు, ఏరియాల్లో కార్మికులకు ఎలాంటి సమస్య ఎదురైనా సమ్మెకు పిలుపునివ్వడం చిన్నాచితకా కార్మిక సంఘాలకు సంప్రదాయంగా మారింది. తద్వారా బొగ్గు ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలిగింది. ఇదేసమయంలో సంస్థ వ్యాప్తంగా ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొచ్చిన క్రాఫ్ట్(వృత్తి) సంఘాలు తమ ఉనికి చాటుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఇలా డిసిగ్నేషన్‌వారీగా సింగరేణిలో ఏర్పడిన క్రాఫ్ట్ సంఘాలు ఏ చిన్న సమస్య వచ్చినా సమ్మెకు పిలుపునివ్వడంతో రోజుల తరబడి ఉత్పత్తి స్తంభించి పోయింది.

60కిపైగా వృత్తి సంఘాలు..

- సింగరేణిలో కోల్‌కట్టర్, టింబర్‌మెన్, బిట్ గ్రైండర్.. ఇలా క్రాఫ్ట్ సంఘాలు అనేకం ఏర్పడ్డాయి.
- ప్రధానంగా సంస్థ వ్యాప్తంగా సుమారు 60కిపైగా వృత్తి సంఘాలు ఆవిర్భవించాయి.
- యాజమాన్యం విధించిన మస్టర్ల కోత చట్టానికి వ్యతిరేకంగా అప్పట్లో 50రోజుల పాటు సమ్మె సాగింది.
- అంతే కాకుండా గనుల్లో సమస్యలు ఏర్పడితే కాఫ్ట్ సంఘాలు వాటి పరిష్కారం కోసం సమ్మెకు దిగాయి.
- ఈక్రమంలో ఏటా సమ్మెల సంస్కృతి పెరిగి ఉత్పత్తికి విఘాతం కలిగింది.
- అన్ని జాతీయ సంఘాలు, సాజక్ కలిసి 03 మార్చి 1989లో సింగరేణి యాజమాన్యంతో ఒక ఒప్పందం కూడా చేసుకున్నాయి.
- ఇలా బలంగా ఏర్పడిన సాజక్.. తమను జాతీయ సంఘాలు అంటరాని యూనియన్‌గా చూస్తున్నాయని, అందుకే సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని, తద్వారా తమకూ గుర్తింపు దక్కుతుందని యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది.
- అయితే, జాతీయ సంఘాలు మాత్రం ఐదు కార్మిక సంఘాలను సమానంగా చూడాలని, కోలిండియా మాదిరిగా సింగరేణిలో జాతీయ సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరాయి.

రంగప్రవేశం చేసిన ఏపీవీఎస్ శర్మ..

సింగరేణి బొగ్గు గనుల్లో సమ్మెలు తరచూ చోటుచేసుకోవడంతో 1998లో అప్పటికి సంస్థ సీ అండ్ ఎండీ ఏపీవీఎస్ శర్మ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇలా సింగరేణిలో తొలిసారి 1998 సెప్టెంబర్ 14న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించారు. రెండేళ్ల కాలపరిమితితో జరిగిన ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించగా సాజక్ 23వేల ఓట్లు పొందింది. అప్పుడు సింగరేణిలో సుమారు 1.20లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు.

హక్కులు సాధించాం



మేం సాజక్‌లో ఉండి అనేక పోరాటాలు చేశాం. అనేక కార్మిక హక్కులు సాధించాం. 1989లో జరిగిన ఒప్పందం చరిత్రాత్మికంగా నిలిచింది. ఎన్నికలను జాతీయ సంఘాలు వ్యతిరేకించినా మేం నిర్వహించాలని ఉద్యమించాం. దీంతో సింగరేణిలో ఎన్నికల సంస్కృతి మొదలైంది. ఆ తర్వాత ఐఎన్‌టీయూసీ జాతీయ నాయకుల ఆహ్వానం మేరకు సాజక్‌ను అందులో విలీనం చేశాం.

– జనక్‌ప్రసాద్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్

తొలుత వ్యతిరేకించాం



సింగరేణిలో గుర్తింపు ఎన్నికలను మొదట్లో వ్యతిరేకించాం. కోలిండియా మాదిరిగా సింగరేణిలో కూడా ఐదు జాతీయ సంఘాలను సమానంగా చూడాలని, చర్చలకు ఆహ్వానించాలని కోరాం. అయితే యాజమాన్యం అంగీకరించలేదు. సాజక్ కూడా వ్యతిరేకించింది. దీంతో 1998లో సింగరేణిలో ఎన్నికలు జరిగాయి. తొలిసారి ఏఐటీయూసీ విజయం సాధించింది.

– వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

మంత్రివర్గంలో మనోళ్లు?!



- దుద్దిళ్ల, పొన్నంలకు చోటు
- జీవన్‌రెడ్డికి సైతం అవకాశం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో సీఎంగా గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్న ఎనుముల రేవంత్‌రెడ్డి కేబినెట్‌లోకి ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురిని మంత్రివర్గంలోకి చోటు లభిస్తుందని సమాచారం. రాష్ట్రం ఏర్పాటు అయ్యాక మూడోసారి కొలువుదీరనున్న మంత్రివర్గంలోకి మంథని నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హుస్నాబాద్ నుంచి విజయం సాధించిన పొన్నం ప్రభాకర్‌లకు మంత్రివర్గంలో స్థానం లభించడం ఖాయమైనట్లు తెలిసింది. సీనియర్ నాయకుడు తాటిపర్తి జీవన్‌రెడ్డికి సైతం మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించేందుకు కాంగ్రెస్ అగ్ర నాయకత్వం యోచిస్తోంది. పెద్దపల్లి జిల్లాకు చెందిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్‌రెడ్డిల కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన అనుభవంతోపాటు ఎన్నికల మేనిఫెస్టో చైర్మన్‌గా వ్యవహరించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా పనిచేసి పార్టీ అధిష్ఠానం దృష్టిలో పడ్డారు. బ్రాహ్మణ సామాజికవర్గం నుంచి గెలిచిన శ్రీధర్‌బాబుకు అన్ని అర్హతలు ఉన్నాయని, కీలక పదవీ వరించనుందని విశ్వసనీయ సమాచారం. మాజీ ఎంపీగా, గతంలో మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పనిచేయడమే కాకుండా ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర బాధ్యులుగా వ్యవహరించి పార్టీ అధిష్టానం దృష్టిలో గుర్తింపు పొందిన హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నం ప్రభాకర్‌కు బీసీ కోటాలో మంత్రి పదవి వరించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమసమయంలో పార్లమెంట్‌లో ఆయన పాత్రతోపాటు సామాజిక సమీకరణాల్లో పొన్నం ప్రభాకర్ ముందు వరుసలోనే ఉన్నట్లు వినికిడి. సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, జగిత్యాల ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిని అనుభవం రీత్యా మంత్రివర్గంలోకి తీసుకొని ఆయన సేవలను వినియోగించుకోవాలని పార్టీ అధిష్ఠానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు అమాత్యులుగా ప్రమాణం చేయనున్నారని సమాచారం.

బడుగుల అభ్యున్నతికి కృషి

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్
- అంబేడ్కర్‌కు ఘన నివాళి

గోదావరిఖని: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్ ఎల్లా హోటల్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన వర్ధంతిలో నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్లు వెంకటరమణారెడ్డి, కుమ్మరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుద్దాం

పెద్దపల్లిరూరల్: అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు దుర్గయ్య, పూరెళ్ల స్వప్న, అనిల్, శారద, బబ్లూ, సతీశ్, స్వప్న, సాగర్, అన్వేశ్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న దాసరి ఉష



నివాళి అర్పిస్తున్న రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో..

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- సింగరేణి జీఎంలు

రామగిరి(మంథని): ఈనెల 23న అన్ని ప్రాంతాల్లో సింగరేణి ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం స్థానిక జీఎం కార్యాలయంలో ఆవిర్భావ వేడుకల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏరియా ఇంజినీర్ పి.ఏలీషా, ఏపీఏ ఎస్‌వోటూ జీఎం డి.బైధ్య, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ప్రాజెక్టు అధికారులు ఎన్.రాధాకృష్ణ, కె.రాజేందర్, సివిల్ డీజీఎం పద్మరాజు, ఐఈడీ డీజీఎం కె.చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్‌రెడ్డి, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి


స్కూల్ బ్యాగులు అందిస్తున్న సీజీఎం

జ్యోతినగర్: అంబేడ్కర్‌ను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. బుధవారం ఎన్టీపీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ పార్కులోని విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వికాస కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అందరూ విజ్ఞానవంతులుగా మారినపుడే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అన్నారు. ఎన్టీపీసీ రామగుండం సంస్థ సామాజిక సేవల ద్వారా ప్రభావిత, పునరావాస గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు, విద్యార్థులకు స్కూలు బ్యాగులు అందించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు, హెచ్‌వోడీలు, సీఎంవో, సెంట్రల్ ఎస్సీసీ సభ్యుడు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు, సమీప గ్రామాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌కు రాజీనామా


దశరథం గౌడ్

యైటింక్లయిన్‌కాలనీ: టీబీజీకేఎస్ సంఘం కేంద్ర కార్యనిర్వాహక సభ్యుడు నాచగోని దశరథం గౌడ్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తి గత కారణాలతో సంఘానికి రాజీనామా చేసినట్లు తెలంగాణ బొగ్గుగని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్యకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాగా రెండ్రోజుల వ్యవధిలోనే ఇద్దరు టీబీజీకేఎస్ ముఖ్య నాయకులు సంఘానికి రాజీనామా చేయడంతో కార్మికుల్లో చర్చనీయాంశంగా మారింది.

నివాళి



మంథని: జనగామ జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి ఇటీవల మృతిచెందగా బుధవారం మంథనిలోని జెడ్పీ చైర్మన్ నివాసంలో సంపత్‌రెడ్డి చిత్రపటానికి జెడ్పీ చైర్మన్లు పుట్ట మధు, జక్కు శ్రీహర్షిణి పూలమాలలువేసి నివాళిఅర్పించారు. ఆయన మృతిపట్ల సంతాపం తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లిరూరల్: ఈత చెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపల్లి మండలం రంగాపూర్‌కు చెందిన బొంగోని రాయమల్లు రోజూ మాదిరిగానే బుధవారం కల్లు గీసేందుకు ఈత చెట్టు ఎక్కుతుండగా జారి పడ్డాడు. దీంతో గాయాలైన రాయమల్లును చికిత్స నిమిత్తం పెద్దపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

నిర్మించి ఏడేళ్లైనా ?

- ప్రారంభానికి నోచుకోని నీరుకుల్ల వంతెన
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- అందుబాటులోకి వస్తే తగ్గనున్న దూరభారం
- కొత్త ప్రభుత్వంలోనైనా ప్రారంభం అయ్యేనా ?


మానేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జి

సుల్తానాబాద్ రూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, కరీంనగర్ జిల్లా మధ్య రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు, దూరభారం తగ్గించేందుకు సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల–వేగురుపల్లి గ్రామాల మధ్య మానేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జి ఏడేళ్లైనా ప్రారంభానికి నోచుకోవడం లేదు. 2016లో బ్రిడ్జి నిర్మాణం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయించింది. అప్పటి మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్ రావు శంకుస్థాపన చేయగా గుత్తేదారు నిర్మాణం చేపట్టి పూర్తిచేశారు. ఇప్పటివరకు ప్రారంభం కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

రూ.47కోట్ల వ్యయంతో నిర్మాణం

మానేరువాగుపై దాదాపు రెండు కిలోమీటర్ల మేర వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.47కోట్లతో నిర్మాణ పనులు చేపట్టింది. దీంతో రెండు జిల్లాలకు రాకపోకలు నిరంతరం కొనసాగుతాయని ప్రయాణికులు భావించారు. కానీ నిర్మాణం చేపట్టేముందు బ్రిడ్జికింద రైతుల పంటపొలాలు ఉండగా వారి నుంచి రోడ్డుకోసం భూములను సేకరించకపోవడంతో ప్రధాన సమస్య ఎదురైంది. సమస్యను పరిష్కరించి వంతెన ప్రారంభించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించినా ప్రారంభానికి నోచుకోలేదని, కొత్త ప్రభుత్వంలోనైనా ప్రారంభానికి నోచుకుంటుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తగ్గనున్న దూరభారం

మానేరువాగుపై నిర్మించిన బ్రిడ్జి అందుబాటులోకి వస్తే అటు మానకొండూర్ మీదుగా సుల్తానాబాద్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాలలకు వెళ్లేవారికి దాదాపు 30–35కిలోమీటర్ల దూరభారం తగ్గుతుంది. అలాగే మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల నుంచి వరంగల్, హైదారాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు సైతం దూరభారం తగ్గడంతో పాటు వ్యయం, సమయం వృథాకాకుండా ఉంటుంది. బ్రిడ్జి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. ఇప్పటికైనా అధికారులు వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.


బ్రిడ్జి మీదకు వెళ్లే దారి

రవాణా పెరుగుతుంది



బ్రిడ్జి అందుబాటులోకి తీసుకువస్తే రాకపోకలతో రవాణా పెరుగుతుంది. వాహనదారులకు దూరభారం తగ్గడంతో పాటు ప్యాసింజర్ వాహనదారులకు గిరాకీ ఉండటంతో లాభసాటిగా ఉంటుంది.

– కె.స్వామి, ఆటోడ్రైవర్, నీరుకుల్ల

దూరభారం తగ్గుతుంది



వంతెన ప్రారంభిస్తే రెండు జిల్లాల పరిధిలో పలు ప్రాంతాలకు వెళ్లే వారికి దూరభారం తగ్గుతుంది. రవాణా ఖర్చులు, సమయం వృథా కాదు. దీంతో ప్రయాణికులకు మేలు జరుగుతుంది.

– కోటగిరి రమేశ్, నీరుకుల్ల, సుల్తానాబాద్

నివేదిక అందించాం

బ్రిడ్జినిర్మాణం పూర్తికాగా లో లెవల్ బ్రిడ్జితో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బ్రిడ్జికింద రోడ్డు నిర్మాణానికి రైతుల భూముల సేకరణలో సమస్య ఉంది. ఈ రెండింటింపై నివేదిక అందించాం. లో లెవల్ వంతెన స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించినట్లయితే మానేరుపై నిర్మించిన వంతెన అందుబాటులోకి వస్తుంది.

–రాములు, రోడ్లు, భవనాల శాఖ ఈఈ

ముగిసిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు


బహుమతులు ప్రదానం చేస్తున్న కైలాస్ యాదవ్

సుల్తానాబాద్: పెద్దపల్లి జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో రెండ్రోజులుగా సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న ఎనిమిదో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలు బుధవారం ముగిశాయి. పోటీల్లో చాంపియన్‌గా వరంగల్ జిల్లా నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో మహబూబ్ నగర్, ఆదిలాబాద్ జిల్లాలు నిలవగా కరీంనగర్ జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి హాజరై విజేతలకు ట్రోఫీలతో పాటు బంగారు, రజత, కాంస్య పతకాలు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో జిల్లాలో జూడో క్రీడకు గ్రామాల్లో ఆదరణ రానుందన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన 18 మంది బాలబాలికలను కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసామన్నారు. కార్యక్రమంలో భారత జూడో సమాఖ్య కోశాధికారి కైలాసం యాదవ్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం. రవీందర్, జిల్లా జూడో సంఘం చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, అధ్యక్షుడు మాటేటి సంజీవ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సిలివేరి మహేందర్, జిల్లా పెటా సంగం కార్యదర్శి వేల్పుల సురేందర్, సాయిరి మహేందర్, అంతటి శంకరయ్య, దాసరి రమేశ్, బిట్ర శ్రీనివాస్, ఎండీ యూనిస్ పాషా, బైరగోని రవీందర్ గౌడ్, కుమార్ కిషోర్, బాలసాని రాజ్‌కుమార్ గౌడ్, అంతర్జాతీయ ఖో ఖో క్రీడాకారుడు గెల్లు మధుకర్ యాదవ్, ఇక్బాల్, శివ, సత్యనారాయణ వివిధ జిల్లాల నుంచి హాజరైన కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకం

- డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్


మాట్లాడుతున్న డాక్టర్ ప్రమోద్‌కుమార్

పెద్దపల్లిరూరల్: గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట విరుద్ధమని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాయని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో బుధవారం గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం -1994 జిల్లా సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికార అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ప్రమోద్‌కుమార్ మాట్లాడారు. జిల్లాలో ప్రతీ వెయ్యిమంది మగపిల్లలకు 926 మంది ఆడ పిల్లలు జన్మిస్తున్నారని తెలిపారు. గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. లింగ నిర్ధారణ అరికట్టేందుకు ఆరోగ్యశాఖ సిబ్బందితో కూడిన బృందం ప్రతీనెల ఐదు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తోందని వెల్లడించారు. తద్వారా స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు లింగ నిర్ధారణ నివారణ చట్టంపై పూర్తిఅవగాహన కల్పించాలని సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాకేశ్, ప్రోగ్రామ్ అధికారి (ఎంహెచ్ఎన్) డాక్టర్ ఆర్.రాజమౌళి, పిల్లల వైద్య నిపుణుడు రవీందర్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరోపణపై విచారణ చేపట్టాలి

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: ఎన్నికల సమయంలో తనపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపణలపై విచారణ చేపట్టాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. బుధవారం మంథనిలో మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేశ్‌తో కలిసి మాట్లాడారు. గత ఎన్నికల్లో రూ.900 కోట్లు సంపాదించుకున్నట్లు ఆరోపిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున తనపై చేసిన ఆరోపణలపై విచారణ చేపట్టాలన్నారు. తనకు ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు ఎంతో అభివృద్ధి చేశానన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ అమలు చేయాలని, ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని సూచించారు. తాను జెడ్పీచైర్మన్ పదవికి రాజీనామా చేసే ఆలోచనలో ఉంటే పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆలోచనను విరమించుకోవాలని కోరారని, నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తల విజ్ఞప్తి మేరకు విరమించుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంతో పాటు ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు.

జాతీయస్థాయి సెస్టోబాల్ పోటీలకు ఎంపిక


పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి సెస్టో పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన మహాలక్ష్మి, హారిణి, అస్మిత, అక్షర, స్ఫూర్తి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికవడంపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభినందించారు. వీరు ఈనెల 15,16,17 తేదీల్లో పంజాబ్‌లోని ధూరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. కరస్పాండెంట్ రజని, ప్రిన్సిపాల్, తదితరులున్నారు.

సింగరేణి కార్మికులకు అలవెన్స్ చెల్లించాలి


ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రామగిరి: అసెంబ్లీ ఎన్నికల విధులు నిర్వహించిన సింగరేణి కార్మికులకు అలవెన్స్‌లు చెల్లించాలని బుధవారం ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావుకు ఏఐటీయూసీ ఆర్జీ–3 బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి అధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా సీనియర్ అసిస్టెంట్స్, జూనియర్ అసిస్టెంట్స్, సెక్యూరిటీ సిబ్బందికి టీఏ, డీఏలు చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఏఐటీయూసీ ఫీట్ సెక్రటరీ కొంరయ్య, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేందర్, సందీప్, సంజీవ్ ఉన్నారు.

కార్మికుల సమస్యల కోసం ఏఐటీయూసీ కృషి


సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: ఏఐటీయూసీ యూనియన్‌ను రాబోయే ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా గెలిపించాలని నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కె.స్వామి, ఆరెల్లి పోషం కోరారు. బుధవారం ఆర్జీ–1 ఏరియా సెక్యూరిటీ సిబ్బందితో కలిసి మాట్లాడారు. సింగరేణిలో ఏడోసారి జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ప్రభుత్వం, యాజమాన్యానికి తొత్తుగా ఉన్న సంఘాలకు బుద్ధి చెప్పాలన్నారు. సింగరేణి కంపెనీ రక్షణ, ఆస్తుల పరిరక్షణ కోసం శ్రమిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్మికుల కోసం పనిచేస్తున్న ఏఐటీయూసీని డిసెంబర్ 27న జరిగే ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా గెలిపిస్తే సంస్థ మనుగడ, హక్కుల సాధన సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో నాయకులు వెంకటస్వామి, కే.వేణుగోపాల్, ఎం.రాజశేఖర్, రెడ్డబోయిన లక్ష్మీపతి, రసూల్, కర్రె రవి, వి.తిరుపతి, పెరుమాండ్ల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సుగ్లాంపల్లిలో చోరీ

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని సుగ్లాంపల్లిలో బుధవారం చోరీ జరిగింది. ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సుల్తానాబాద్ మండలం పెర్కపల్లి చెందిన పల్లె సదయ్య కుటుంబ సభ్యులతో కలిసి సుగ్లాంపల్లిలో నివాసముంటున్నాడు. సదయ్య ఓ మిల్లులో వాచ్‌మన్‌గా పనిచేస్తుండగా భార్య రజిత ప్రైవేట్ పాఠశాలలో ఆయాగా పనిచేస్తోంది. బుధవారం ఇద్దరు ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. సాయంత్రం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండగా ఇంట్లోని రూ.28వేలు నగదు, బంగారం, 10తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బొగ్గు బాయి

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్


మాట్లాడుతున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనకు కృషిచేయాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం కూరగాయల మార్కెట్ సమీపంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏరియాలోని బొగ్గు గనులు, డిపార్ట్‌మెంట్లపై ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. అంబేడ్కర్ బహుజనుల ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పులి మోహన్, యాట ఓదెలు, రాంచందర్, జనగామ నర్సయ్య, బడికెల కృష్ణ, దాట్ల ఉమేందర్, స్వామి, బోయిని స్వామి, రాజశేఖర్, సురేశ్ బాబు, సంబోజు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కార్పొరేట్ వైద్యం అందిస్తాం

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య


మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని: కార్మికులకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు కృషిచేస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. బుధవారం జీడీకే-2ఏగనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. కార్పొరేట్ విద్య, సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు పోరాడుతామన్నారు. సింగరేణి కార్మికుల పిల్లలకు కేంద్రీయ విద్యాలయాల ద్వారా నాణ్యమైన విద్య అందించేందుకు కృషిచేస్తామన్నారు. సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలు పేరుకపోయాయని, కొత్తగనులు రాక యువత ఉద్యోగాలు లేకుండా పోతున్నాయని వాపోయారు. కార్మికుల సమస్యల కోసం కృషిచేస్తున్న బీఎంఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గేట్ మీటింగ్‌లో నాయకులు వై.సారంగపాణి, ఆకుల హరిణ్, తాట్ల లక్ష్మయ్య, సంగాని సాంబయ్య, తడగొండ నరసయ్య, రాపోలు వజ్రవేణు, చీకట్ల మల్లేశం, సాయవేణి సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త గనుల ఏర్పాటుతో తగ్గుతున్న ఉపాధి


సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

గోదావరిఖని: సంస్థలో కొత్తగనుల ఏర్పాటుతో ఈప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గని, ఓసీపీ–3 బేస్ వర్క్‌షాప్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. సింగరేణిలో ఒక్క కొత్త భూగర్భ గని రాకపోగా చాలా గనులు మూసివేశారన్నారు. కొత్త గనులు రాకపోతే డిపెండెంట్ ఉద్యోగులుగా చేరినవారు ఇబ్బంది పడుతారన్నారు. కార్మికులకు సొంత ఇంటి పథకం కింద రెండుగుంటల భూమి రూ.20 లక్షల వడ్డీ లేని రుణం ఇచ్చేలా చూస్తామన్నారు. ఈనెల 27న జరిగే ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. నాయకులు ఎల్.ప్రకాశ్ , కె.రాజరత్నం, అన్నారావు, రవీందర్, తిరుపతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఉత్సాహం నింపాలి


స్వీట్లు పంచిపెడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: ఆట, పాటలతో దివ్యాంగుల్లో నూతనోత్సాహాన్ని నింపాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మనోచైతన్య వికలాంగుల వృత్తి శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించి ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగ పిల్లల్లో ఉత్సాహం నింపేందుకు, ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం తరగతి గదులు, దివ్యాంగులు తయారు చేస్తున్న ఫైల్స్, నోట్‌బుక్స్, తయారీ విధానాన్ని పరిశీలించారు. జీఎం వెంట మనోచైతన్య నిర్వాహకులు కృష్ణకుమార్, పర్సనల్ ఏజీఎం సీహెచ్ లక్ష్మీనారాయణ, రిటైర్ ఎంఈవో రాజయ్య, నందయ్య, సెక్యూరిటి ఆధికారి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవితను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు


ఎమ్మెల్సీ కవితతో టీబీజీకేఎస్ నాయకులు

రామగిరి: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బి. వెంకట్రావు, జనరల్ సెక్రటరీ మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య కలిశారు. సింగరేణి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎన్నికలపై చర్చించారు. కార్మికుల్లో 50 శాతం యువ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నందున ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని కవిత సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థను లాభాల బాటా పట్టించిన విషయాన్ని కార్మికులకు తెలిపాలన్నారు. టీబీజీకేఎస్ ద్వారా యువత, మహిళలకు ఉద్యోగ కల్పన సాధ్యమైందన్న విషయాన్ని కార్మికులకు వివరిస్తూ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచేలా ప్రణాళికలు రూపొదించాలన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి


అధికారులతో సమావేశమైన ఆర్జీ–3 జీఎం

రామగిరి: నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేయాలని ఆర్జీ–3 జీఎం ఎన్. సుధాకర్ రావు అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలో బొగ్గు ఉత్పత్తి, రవాణాపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలకు అనుగుణంగా సమష్టిగా పనులు నిర్వహించి ఉత్పత్తి లక్ష్య సాధనకు తోడ్పాడాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించి సంస్థ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. సమావేశంలో ఏరియా ఇంజినీర్ ఎలీషా, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ప్రాజెక్టు అధికారులు రాధాకృష్ణ, రాజేందర్, సీహెచ్‌పీ డీజీఎం కాశీ విశ్వేశ్వర రావు, ఐఈడీ డీజీఎం కే. చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని: రాబోయే గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ యూనియన్‌ను గెలిపిస్తే సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేస్తామని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు యూనియన్లకు చెందిన కార్మికులు యూనియన్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. రెండేళ్లుగా కార్మికుల సమస్యలపై సీఐటీయూ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. కార్మికుల సొంతింటి పథకం అమలయ్యేంతవరకు పోరాటం ఆపేది లేదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. సమావేశంలో నాయకులు మెండె శ్రీనివాస్, గజేంద్ర, ఆసరి మహేశ్, సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, కారం సత్తయ్య, పి.శ్రీనివాసరావు, వంగల రాములు, దాసరి సురేశ్, నంది నారాయణ, బీమానాయక్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.